సాక్షి నంద్యాల

శుక్రవారం • 9 • జూన్ • 2023



1.1 టీఎంసీల నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో 1.1 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ నుంచి తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



అక్షరాభ్యాస వేడుక

కొత్తపల్లి: కొలనుభారతి క్షేత్రంలో గురువారం పంచమిని పురస్కరించుకొని అక్షరాభ్యాస వేడుకను నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన చిన్నారులకు బీజాక్షరాలను దిద్దించారు.



బడి బస్సు భద్రమేనా!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాఠశాలల బస్సులు 1,222 ఉన్నాయి. వాటిలో 794 బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయించారు. ఇంకా 428 బస్సులకు ఫిట్‌నెస్ చేయాల్సి ఉంది. 8లో▸

విద్యార్థులకు మామయ్య కానుక

- పాఠశాలలు పునఃప్రారంభమయ్యే రోజే విద్యా కానుక కిట్ల పంపిణీ
- జిల్లాలో 29 జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్లు
- కిట్ల నిల్వ.. రవాణాకు జిల్లా, మండల స్థాయిలో కమిటీల ఏర్పాటు
- ఈ ఏడాది సరికొత్తగా చెక్స్ యూనిఫాం మూడు జతల అందజేత
- 1,441 ప్రభుత్వ పాఠశాలల్లోని 1.90 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యారంగాన్ని సమూలంగా మార్చారు. జగనన్న విద్యాకానుక పేరుతో పాఠ్య పుస్తకాలే కాకుండా బ్యాగు, బూట్లు, బెల్ట్, రెండు జతల సాక్సులు, మూడు జతల యూనిఫాం, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, నోటు పుస్తకాలు అందిస్తున్నారు. ఏటా జూన్‌లోనే విద్యా కానుక పంపిణీని పక్కాగా చేపడుతున్నారు.



ఆళ్లగడ్డ పాఠశాలకు చేరిన విద్యాకానుక కిట్లు

ఆళ్లగడ్డ /నంద్యాల (న్యూటౌన్): పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయంటే తల్లిదండ్రులకు పాఠ్యపుస్తకాల కొనుగోలు పెద్ద సవాల్‌గా ఉండేది. భారీగా జేబుకు చిల్లు పడేది. ఇప్పుడా పరిస్థితి లేదు. తల్లిదండ్రులకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ రాష్ట్రప్రభుత్వమే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తోంది. అలాగే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులు స్కూళ్లకు వెళ్లేందుకు టై, బెల్టు, యూనిఫాం, నోటు పుస్తకాలు, బ్యాగుతోపాటు కానుక రూపంలో ఇస్తోంది. అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే రోజునే కానుక అందుతుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

80 శాతం పుస్తకాలొచ్చాయి..

జిల్లాలో 11,01,219 పాఠ్య పుస్తకాలు అవసరమని విద్యాశాఖ అధికారులు అంచనా నివేదిక పంపించారు. ఇందులో 80 శాతం పుస్తకాలు జిల్లా బుక్‌స్టోర్లకు చేరాయి. ఇప్పటి వరకు చేరిన 7,13,385 పుస్తకాలను ఆయా మండలాలకు చేరవేశారు. ఇంకా 3,87,834 పుస్తకాలు రావాల్సి ఉంది. జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల్లో విద్యార్థులు రాణించాలన్న ఉద్దేశంతో సీబీఎస్‌ఈ సిలబస్‌ను ప్రారంభించేందుకు కొన్ని స్కూళ్లను ఎంపిక చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆయా స్కూళ్లకు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ పాఠ్య పుస్తకాలను అందించనున్నారు.

29 స్టాక్ పాయింట్లు

జిల్లాలోని 1,441 పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న సుమారు 1.90 లక్షల మంది విద్యార్థులకు తొలిరోజు పాఠశాలల్లో అడుగు పెట్టిన క్షణంలోనే 8 రకాల వస్తువులతో కూడిన జగన్న విద్యాకానుక కిట్లను అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జగనన్న విద్యాకానుక ఈ ఏడాది విద్యార్థులకు మరింత వేగంగా చేరవేసేందుకు జిల్లాలోని 29 మండలాల్లో ఒక స్టాక్ పాయింట్ చొప్పున ఏర్పాటు చేశారు. స్టాక్ పాయింట్‌కు వచ్చిన వస్తువులన్నింటినీ ఒక కిట్టు రూపంలో సిద్ధం చేసి ఒకే సారి విద్యార్థులకు అందించనున్నారు.

కిట్‌లో ఉండే వస్తువులు ఇవే..

జనన్న విద్యాకానుక కిట్టులో బ్యాగు, ప్రింటింగ్ పుస్తకాలు, నోట్‌బుక్స్, యనిపాం, షూ, బెల్టు, రెండు రకాల డిక్షనరీలు ఉండనున్నాయి. బెల్టు 1 నుంచి 10వ తరగతి బాలురకు, 1 నుంచి 5 వతరగతి వరకు చదువుతున్న బాలికలు అందిస్తారు. నోట్ బుక్‌లు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు, డిక్షనరీలు 1 నుంచి 6వ తరగతి వరకు ఒక రకం, 7 నుంచి 10 వతరగతి వరకు ఒక రకం అందిస్తారు. ఇందుకు సంబంధించి గత సంవత్సరం డిసెంబర్ నుంచే విద్యార్థుల వివరాలను సేకరించారు. వారికి సరిపడే విధంగా బూట్లు, యూనిఫాం కొలతలను సైతం పంపారు.

కమిటీల పర్యవేక్షణ

స్టాక్ పాయింట్లో విద్యాకానుకల వస్తువులు నిల్వ చేసే సమయంలోను దీంతో పాటు వీటిని పంపిణీకి, పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయి కమిటీని నియమించారు. ఇందులో స్టోరేజ్ పాయింట్ చైర్మన్‌గా ఎంఈఓను, కన్వీనర్‌గా ఆ పాఠశాల (స్టాక్ పాయింట్) హెచ్‌ఎం, సభ్యులుగా వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం, మండల ఇంజినీరింగ్ అధికారి, సీఆర్పీలను నియమించారు. వీరంతా విద్యాకానుక కిట్లు పాఠశాలలకు చేరవేసే సమయంలో అన్ని రికార్డులను సక్రమంగా ఉంచేలా ఆదేశాలు ఉన్నాయి. జిల్లా స్థాయి కమిటీ వీటిని నిరంతరం పర్యవేక్షిస్తుంది.

బయోమెట్రిక్ పద్ధతిలో పంపిణీ

జిల్లాలో ఇప్పటికే 80శాతం జగనన్న విద్యాకానుక కిట్లు మండలాల స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయి. ఈ వస్తువుల నాణ్యత పరిశీలన కూడా పూర్తయింది. మిగిలినవి కూడా పాఠశాలలకు త్వరలో రానున్నాయి. కిట్లు పూర్తిగా వచ్చిన తర్వాత పాఠశాలలకు సరఫరా చేస్తారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధుల ద్వారా విద్యార్థులకు అందజేస్తారు. వచ్చిన కిట్లు పక్కదారి పట్టకుండా బయోమెట్రిక్ పద్ధతిలో పంపిణీ చేస్తారు.

ఐదు శాతం అదనంగా కిట్లు

గతంలో విద్యాకానుక కిట్ల పంపిణీలో తలెత్తిన చిన్న లోపాలను సైతం ఈ విద్యాసంవత్సరంలో ఏమాత్రం పునరావృత్తం కాకుండా చూసుకునేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలలకు పెరుగుతున్న ఆదరణతో ఏటా అదనంగా చేరుతున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని అంచనాకంటే ఐదు శాతం కిట్లను మండల స్టాక్ పాయింట్లకు చేర్చుతున్నారు.

ఆకర్షణీయమైన చెక్స్ యూనిఫాం

యూనిఫాం గతానికి భిన్నంగా ఆకర్షణీయంగా ఉండేలా డిజైన్ చేశారు. గతంలో బాలికలకు టాప్, బాలుర షర్ట్‌లను ప్లెయిన్‌వి ఇచ్చేవారు. ఈఏడాది నుంచి వాటిని చెక్స్ రూపంలోకి మార్పు చేశారు. దుస్తులు కుట్టే సమయంలో సమస్యలు ఎదురు కాకుండా క్లాత్ పరిమాణాన్ని 20 శాతం అదనంగా పెంచారు. గతంలో మాదిరిగా ఏడాదికి రెండు జతల యూనిఫాం కాకుండా ఈ ఏడాది నుంచి ఒక్కో విద్యార్థికి మూడు జతలు అందించనున్నారు.

జిల్లాలో జగనన్న విద్యా కానుక ఇండెంట్ ఇలా..

వస్తువు	ఇండెంట్
ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు	18,670
ఫిక్టోరల్ డిక్షనరీలు	12,518
వర్క్ బుక్కులు	2,70,877
టెక్స్ బుక్కులు (సెమ్ - 1)	11,01,219
మూడు జతల యూనిఫాం క్లాత్	1,62,276
నోట్ బుక్కులు	9,56,152
బెల్టులు	1,14,260
షూ, సాక్స్‌లు	1,62,276
బ్యాగులు	1,62,276

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, 2022 - 23 విద్యాసంవత్సరంలో విద్యార్థుల వివరాలు

పాఠశాల పేరు	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	962	69,825
ప్రాథమికోన్నత	194	23,102
ఉన్నత పాఠశాలలు	285	93,408
మొత్తం	1,441	1,86,335



జగనన్న విద్యాకానుక కిట్లలోని వస్తువులు

నాణ్యతలో రాజీ లేదు



పాఠశాలలు తెరిచే రోజే విద్యాకానుక కిట్లు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలోని 29 స్టాక్ పాయింట్లకు వచ్చిన వస్తువులను మండల స్థాయి కమిటీల ఆధ్వర్యంలో పరిశీలించి నాణ్యత నిర్ధారించారు. నాణ్యతలో రాజీ లేకుండా బాగుంటేనే పాఠశాలలకు తరలిస్తున్నాం.

– అనురాధ, జిల్లా విద్యాశాఖాధికారిణి

బుక్కులు బాగున్నాయి



మేం బయట కొనుక్కోకుండా అన్ని రకాల బుక్కులు ఇస్తున్నారు. బ్యాగు, షూ, డిక్షనరీ చాలా బాగున్నాయి. మాలాంటి పేదలకు ఇవి ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి.

– నందిని, ఆర్ కృష్ణాపురం, జెడ్పీ హైస్కూల్

చాలా సంతోషం



ఏటా విద్యాకానుక కిట్టు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. కిట్టులోని వస్తువులు చాలా బాగున్నాయి. ఈ సారి చెక్స్ యూనిఫాం ఇస్తామంటున్నారు. మాలాంటి పేదల కోసం జగన్ మామయ్య ఎంతో చేస్తున్నారు. థాంక్స్ టూ జగన్ మామయ్య.

– యాస్మిన్, క్రిష్టిపాడు, జెడ్పీ హైస్కూల్

న్యూస్‌రీల్

కేజీబీఓ సభ్యుల శ్రీశైలం డ్యాం సందర్శన



డ్యాం వద్ద సీఈ వీరేంద్రశర్మ, ఇంజినీర్లు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయాన్ని కృష్ణా, గోదావరి బోర్డ్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజినీర్ వీరేంద్రశర్మ తన బృందంతో కలిసి గురువారం సందర్శించారు. వర్షాలు కాలం రావడంతో జలాశయానికి ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వరదనీరు చేరుతుంది. డ్యాం పర్యవేక్షణకు ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది ఏమేరకు ఉన్నారు అనే విషయంపై డిప్యూటీ ఎస్‌ఈ గంగాధరరెడ్డిని వీరేంద్రశర్మ అడిగి తెలుసుకున్నారు. శ్రీశైలం డ్యాం పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. రేడియల్ క్రస్ట్‌గేట్ల నిర్వహణపై ఆరా తీశారు. గ్యాలరీ, గేజింగ్ సెక్షన్లను తనిఖీ చేశారు. కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాలను పరిశీలించారు.

12న డీసెట్

కర్నూలు సిటీ: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌కి సంబంధించిన డీసెట్‌ను ఈనెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు డీఈఓ రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ పరీక్షను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు సనత్‌నగర్‌లోని అయాన్ డిజిటల్ జోన్ ఐడీ జెడ్‌లో నిర్వహించనున్న పరీక్షకు 357 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు డీఈఓ వెల్లడించారు.

26 నుంచి 'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు పదో తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లాలో 7 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షలకు 1,600 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ముగిసిన మూల్యాంకనం

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం గురువారంతో ముగిసింది. గత నెల 24 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. కర్నూలు ప్రభుత్వ జూనియర్(టౌన్ మోడల్)కాలేజీలో స్పాట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా 1,14,000 సమాధాన పత్రాలు వచ్చాయి. మూల్యాంకనం ముగియడంతో ఫలితాలు ఈ నెల 15, 16వ తేదీల్లో విడుదల చేసే అవకాశం ఉన్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు.

మేయర్ బీవై రామయ్యకు అరుదైన అవకాశం

- ఏఐసీఎం కార్యనిర్వాహక కమిటీ సభ్యుడిగా నియామకం



కర్నూలు (టౌన్): నగర మేయర్ బీవై రామయ్యకు అరుదైన అవకాశం లభించింది. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ (ఏఐసీఎం) కార్యనిర్వాహక కమిటీ సభ్యుడిగా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీఎం కార్యదర్శి మనోజ్‌గుప్తా గురువారం నియామక పత్రాన్ని మేయర్‌కు పంపించారు. నిబద్ధత, పనితీరు, నాయకత్వ లక్షణాలను గుర్తించి ఏఐసీఎం చైర్మన్ మాథూర్ అతుల్ పటేల్ ఈ నియామాకాన్ని చేపట్టారు. కార్యనిర్వాహక కమిటీ సభ్యుడిగా బీవై రామయ్య రెండేళ్ల పాటు కొనసాగుతారు. 62 ఏళ్ల చరిత్ర కలిగిన ఏఐసీఎంలో కర్నూలు మేయర్‌కు ప్రాతినిధ్యం లభించడం విశేషం.

నిమ్స్ డైరెక్టర్‌గా డాక్టర్ నగరి బీరప్ప



కర్నూలు(అర్బన్): తెలంగాణ రాష్ట్రంలో పేరెన్నికగన్న నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) డైరెక్టర్‌గా కర్నూలు జిల్లా మద్దికెర మండలం బురుజుల గ్రామానికి చెందిన డాక్టర్ నగరి బీరప్ప నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎస్‌ఏఎం రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డాక్టర్ బీరప్ప నిమ్స్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన నిమ్స్ డైరెక్టర్‌గా మూడు సంవత్సరాలు కొనసాగుతారని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

చల్లని కబురు

- తేలికపాటి నుంచి మోస్తరు వర్షం



హొళగుంద కుమ్మర వీధిలో నిలిచిన వర్షపు నీరు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు జిల్లాలోని 19 మండలాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు పడ్డాయి. నైరుతి రుతుపవనాలు గురువారం కేరళ తీరాన్ని తాకాయి. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉంది. దీంతో రానున్న రోజుల్లో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రాంతం	వర్షపాతం(మి.మీ.,)
ఆస్పరి	21
సి.బెళగల్	18.2
కోడుమూరు	17
కల్లూరు	13.2
ఆలూరు	12.2
వెల్దుర్తి	10.2
డోన్	12.4
ప్యాపిలి	10.4
సంజామల	10.2

గూడూరులో అత్యధికంగా 25.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తంగా సగటున 7.3 మి.మీ వర్షం కురిసింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ కాగా.. ఇప్పటి వరకు 12.5 మి.మీ వర్షపాతం నమోదైంది.

నంద్యాల జిల్లాలో...

జిల్లాలోని 17 మండలాల్లో వర్షం కురిసింది. మహానందిలో 41.2 మి.మీ వర్షం కురువగా.. మిగిలిన మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షపాత నమోదైంది. జిల్లా మొత్తం సగటున 4.8 మి.మీ వర్షం కురిసింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 76.8 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 9.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

నేడు కర్నూలుకు కంచి పీఠాధిపతి



శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి

కర్నూలు(అర్బన్): కంచి పీఠం అధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి ఈ నెల 9న ఉదయం 7 గంటలకు నగరంలోని ఖండేరి వీధి శంకర మఠంకు వస్తున్నట్లు అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. గురువారం స్థానిక శంకరమఠంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 7.30 గంటలకు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 6 గంటలకు శ్రీ మహాత్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి పీఠం పూజ నిర్వహిస్తారన్నారు. 10వ తేదిన ఉదయం కూడా ఈ పూజా కార్యక్రమాల్లో విజయేంద్ర సరస్వతీ స్వామి పాల్గొంటారన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో ఏపీ బ్రాహ్మణ సేవా సమాఖ్య కోశాధికారి హెచ్‌కే మనోహర్‌రావు, నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్‌కే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ కోర్టుకు డిప్యూటీ డీఈఓ హాజరు

- రిమాండ్ విధించిన జడ్జి
- ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం జైలుకి తరలింపు

కర్నూలు సిటీ: ఏసీబీకి పట్టుబడిన ఆదోని డిప్యూటీ డీఈఓ సుకుమార్, సమగ్ర శిక్ష కార్యాలయం పర్యవేక్షకులు కామరాజు, నైట్ వాచ్‌మెన్ రమేష్‌లను గురువారం కర్నూలు బిక్యాంపులోని ఏసీబీ కోర్టుకు హాజరుపరిచారు. వీరికి జడ్జి రిమాండ్ విధించారు. హాస్పిటల్‌లో వైద్య పరీక్షల అనంతరం ముగ్గురిని జైలుకి తరలించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఏసీబీ అధికారులు కర్నూలు సమగ్ర శిక్ష కార్యాలయంలోనే విచారణ చేశారు. ఆదోని డిప్యూటీ డీఈఓ సుకుమార్‌ది కడప స్వస్థలం. అక్కడి ఆయన నివాసంలోనూ ఏసీబీ సోదాలు చేశారు. సుకుమార్ కడప ఆర్జేడీ ఆఫీస్‌లో పని చేసే సమయంలో భారీగానే ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. సమగ్ర శిక్ష కార్యాలయంలో పర్యవేక్షకులుగా పని చేస్తున్న కామరాజు, ఆర్జేడీ ఆఫీస్‌లోనే పని చేసే సమయంలో నుంచే సుకుమార్‌లకు పరిచయం, ఆదోని డిప్యూటీ డీఈఓగా వచ్చిన తరువాత వారి స్నేహం బలపడింది. ఆదోని డివిజన్ పరిధిలోని అన్ని ఫిర్యాదులు, ప్రైవేటు స్కూళ్ల అఫ్లియేషన్ తదితర అంశాల్లో కామరాజు మధ్యవర్తిగా ఉండి పనులు చక్కబెట్టేవారనే విమర్శలు ఉన్నాయి. కామరాజు నంద్యాల డీఈఓ ఆఫీస్‌లో పని చేసే సమయంలోనే ఆయన ప్రవర్తనపై అనేక ఆరోపణలు రావడంతో అక్కడ డీఈఓగా పని చేసే అధికారి ఆయనను ఆర్జేడీకి సరెండర్ చేశారు. అయితే అక్కడ పని చేసే ఓ కీలక అధికారి సహకారంతో కర్నూలు సమగ్ర శిక్ష కార్యాలయానికి గతేడాది బదిలీపై వచ్చారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రతి నెలా తనకు వెయ్యి రూపాయలు ఇవ్వాలని బెదిరింపులు చేయడంతో జిల్లా కలెక్టర్ వరకు ఫిర్యాదులు వెళ్లాయి.

తిరుమల తరహాలో మద్దిలేటయ్య క్షేత్రం అభివృద్ధి





కలశ పూజలు చేస్తున్న మంత్రి బుగ్గన , మహా ప్రాకారం, మహా మండపం నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల తదితరులు

- మహా ప్రాకార, మండపం నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి బుగ్గన

బేతంచెర్ల: తిరుమల తరహాలో శ్రీ మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రూ.3.90 కోట్లతో పునర్నిర్మించిన నూతన ఆలయ విమానగోపురాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ధ్వజస్తంభ, కలశ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. యాగాలకు పూర్ణాహుతి ఇచ్చేందుకు ద్రవ్యాలను సమర్పించారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, తమిళనాడు రాష్ట్రం శివగంగ జిల్లా కలెక్టర్ పల్లె మధుసూదన్‌రెడ్డితో కలిసి రూ.12.70 కోట్లతో నిర్మించే మహా ప్రకారం, మహా మండపం నిర్మాణ శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. శ్రీ మద్దిలేటి స్వామి క్షేత్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మారుస్తామన్నారు. వాస్తు శిల్పులు, స్తపతి, దేశం నలుమూలల నుంచి వచ్చిన ఆర్కిటెక్ బృందం సభ్యులు ఇచ్చిన డిజైన్ ప్రకారం శ్రీ చక్రం ఆకారంలో మహా ప్రకార మండపం నిర్మాణం సాగుతుందని చెప్పారు. స్వామి వారి పాదమండపం సమీపాన హరిత హోటల్, పార్కు, యాంపీ థియేటర్ నిర్మిస్తామని చెప్పారు. దేవుని దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకర వాతావరణంతోపాటు సకల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన మూడేళ్లలోనే ఆలయానికి రూ.9.80 కోట్లతో డబుల్ రోడ్డు వేశామన్నారు. ఆలయ ఆవరణలో రూ.1.98 లక్షలతో సీసీ రోడ్లు, కల్వర్టు నిర్మించినట్లు చెప్పారు. మద్దిలేటి స్వామి అనుగ్రహంతో క్షేత్ర అభివృద్ధి పనులు చేపట్టడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మాస్టార్ ప్లాన్ ప్రకారం క్షేత్రాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దుతామన్నారు. సోమయాజులపల్లె నుంచి బేతంచెర్ల మీదుగా డోన్‌కు వెళ్లే జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. ఆలయంలో తిరుమల తరహాలో కైంకర్యాలు, పూజలు జరిగేవిధంగా చూడాలని ఈఓ, వేదపండితులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్తపతి పరమేశ్వరప్ప, తిరుపతి ఎస్‌ఈ పుల్లయ్య, ఈఈ సతీష్, కర్నూలు దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రాణా ప్రతాప్, ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్లు లక్ష్మిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, బాలీశ్వర్ రెడ్డి, మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ , జెడ్పీటీసీ సభ్యురాలు శివలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, బుగ్గన బలరామిరెడ్డి, రాజేంద్రనాథ్‌రెడ్డి, శివరామిరెడ్డి, రాజేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్‌లను త్వరితగతిన పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

- వైద్యాధికారులను ఆదేశించిన కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె. ఎస్. జవహర్ రెడ్డి వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీల పరిష్కారం, వైద్య ఆరోగ్యం, భూముల రీ సర్వే, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, నాడు-నేడు, జగనన్న విద్యా కానుక కిట్లు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలారీ శామూన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగులో ఉన్న 169 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అసంక్రమిత వ్యాధుల సర్వే 81.2 శాతమే పూర్తయిందని మిగిలిన లక్ష్యాన్ని వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద కాంటాక్ట్ ఆపరేషన్లు 74 శాతమే పూర్తయ్యాయని, స్వచ్ఛంద సంస్థలతో సమావేశమై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. పాఠశాలల్లో నాడు- నేడు కింద చేపట్టిన నిర్మాణ పనులకు వ్యయ బిల్లులు సమర్పించాలని ఆదేశించారు. జగనన్న విద్యా కానుక కిట్ల సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేసిన ఎక్సరే మిషన్లు కంప్యూటెడ్ రేడియాగ్రఫీ సిస్టం పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాగి జావాకు సంబంధించిన మెటీరియల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.

'ఉపాధి' గిట్టుబాటు

- రాష్ట్రం మొత్తం మీద సగటు వేతనం రూ.246
- కర్నూలు జిల్లాలో రూ.267
- కోనసీమ జిల్లాది రెండో స్థానం

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు గరిష్ట వేతనం అందించడంలో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఉపాధి కూలీలకు చేసిన పనిని బట్టి అత్యధికంగా రూ.272 వేతనం లభిస్తుంది. ఈ స్థాయిలో వేతనం అందుకునే కూలీల సంఖ్య స్వల్పంగానే ఉంటుంది. రాష్ట్రం మొత్తం ఉపాధి కూలీల సగటు వేతనం రూ.246 ఉండగా.. ఈ నెల 8న జిల్లాలో సగటు వేతనం రూ.267గా నమోదైంది. మే నుంచి కొద్ది రోజులుగా జిల్లాలోనే అధిక సగటు వేతనం ఉంటోంది. కోనసీమ జిల్లా రూ.266 సగటు వేతనంతో 2వ స్థానంలో నిలిచింది. ఏప్రిల్ 1 నుంచి జూన్ నెల వరకు 51.49 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 44,36,353 పని దినాలు కల్పించినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు.

బడి బస్సు భద్రమేనా!

- వాహన సామర్థ్యంపై ఆసక్తి చూపని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం బస్సుల సంఖ్య 1,222
- ఇప్పటివరకు ఎఫ్‌సీ చేయించుకున్నవి 794
- ఇంకా ఫిట్‌నెస్ చేయించుకోవల్సిన బస్సులు 428



కర్నూలు: తమ పిల్లలు బాగా చదవాలని తల్లిదండ్రులు శివారు ప్రాంతాల్లోని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు సైతం పంపేందుకు వెనుకాడటం లేదు. స్కూళ్లలో విద్యా ప్రమాణాల గురించి ఆలోచిస్తున్నారే కాని అక్కడి వసతుల గురించి ఆరా తీయడంలో లేదు. చదువుతో పాటు నిత్యం రాకపోకలు సాగించే బస్సుల కండీషన్‌పై కూడా దృష్టి సారించాల్సిన అవసరముంది. 10 నుంచి 15 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుండటంతో తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు సైతం బస్సుల నిర్వహణపై తగు జాగ్రత్తలు తీసుకుంటే చిన్నారుల ప్రయాణం సుఖమయమవుతుంది. మరో నాలుగు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు రవాణా శాఖ కార్యాలయాల్లో మే 15 లోగా ఫిట్‌నెస్ పత్రాలన్నీ సమర్పించి సామర్థ్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంది. జూన్ 12లోగా చిన్నచిన్న మరమ్మతులు చేయించి సామర్థ్య పరీక్షలు చేయించుకునేందుకు అవకాశం ఉంది. ఇప్పటికీ కొన్ని పాఠశాలలు స్పందించ లేదు. విద్యార్థుల ప్రయాణం విషయంలో జాగ్రత్తలతో అన్ని పత్రాలు సమకూర్చుకుని ఫిట్‌నెస్ చేయించుకుంటేనే బస్సులు రోడ్డుపైకి రావాలని రవాణా, పోలీసు శాఖల అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పాఠశాలల బస్సులు మొత్తం 1,222 ఉండగా వాటిలో 794 బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయించారు. ఇంకా 428 బస్సులకు ఫిట్‌నెస్ చేయాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలోని పాఠశాల, కళాశాలల బస్సుల వివరాలు...

జిల్లా	మొత్తం బస్సులు	ఎఫ్‌సీ ఉన్నవి	ఎఫ్‌సీ కానివి
కర్నూలు	530	394	136
నంద్యాల	692	400	292

సహాయకుల వివరాలు తప్పనిసరి...

పాఠశాల, కళాశాలల బస్సులకు సామర్థ్య పరీక్షలు చేసుకునేందుకు వీలుగా ఉమ్మడి జిల్లాలోని ఆర్‌టీఏ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉంటూ సామర్థ్య పరీక్షలు చేపడుతున్నారు. ఫిట్‌నెస్ ధృవపత్రం, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ పత్రాలతో పాటు డ్రైవర్‌కు సంబంధించిన లైసెన్స్ చూపించి పరీక్షలు నిర్వహించుకోవాల్సి ఉంటుంది. డ్రైవర్ లైసెన్స్ వివరాలు బస్సుపై ముద్రించి ఉండాలి. అయితే డ్రైవర్‌తో పాటు బస్సులో ఉండే సహాయకుల వివరాలను కార్మిక శాఖ కార్యాలయంలో నివేదించి వారు ధ్రువీకరించిన పత్రం సైతం రవాణా శాఖ కార్యాలయంలో సమర్పించాలి.

నిబంధనలు ఇవీ...

- పాఠశాలల బస్సులు నడిపే డ్రైవర్ వయస్సు 60 ఏళ్ల లోపు ఉండాలి.
- ఐదేళ్లు భారీ వాహనం నడిపిన అనుభవం తప్పనిసరి.
- ప్రతి పాఠశాల బస్సుకు డ్రైవర్‌తో పాటు క్లీనర్ (సహాయకుడు)ను నియమించుకోవాలి.
- బస్సు కండీషన్‌లో ఉండటమే కాకుండా బ్రేక్ వేసిన సమయంలో నాలుగు వైపులా పార్కింగ్ లైట్లు వెలగాలి.
- ప్రథమ చికిత్స బాక్స్ (ఫస్ట్ ఎయిడ్), ఫైర్, అత్యవసర ద్వారాలు ఉండాలి.
- చిన్నపిల్లలు బస్సు ఎక్కేలా మెట్లకు కింది భాగంలో అదనంగా మరో మెట్టు అమర్చుకోవాలి.
- బస్సులోని కిటికీలకు ఇరువైపులా నాలుగు వరుసల పైపులు తల బయట పెట్టి తొంగి చూడకుండా జాలి అమర్చి ఉండాలి.
- వాహనం వేగంగా నడిపినా, అజాగ్రత్తగా వ్యవహరించినా, నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడినా డ్రైవర్లపై చర్యలు తీసుకునేలా పేరెంట్స్ కమిటీ ద్వారా బస్సులో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలి.
- బస్సుకు ముందు రెండు వైపులా పాఠశాల, కళాశాలల చిరునామాతో పాటు ఫోన్ నంబర్ విధిగా రాయాలి.

ఫిట్‌నెస్ లేకుండా నడిపితే సీజ్ చేస్తాం



పిల్లల సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలి. పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమవుతున్న దృష్ట్యా బస్సులకు సామర్థ్య పరీక్షలు తప్పనిసరి. ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల యజమానులు స్పందించాలి. ఏ ఒక్క పత్రం లేకుండా బస్సు రోడ్డెక్కితే చర్యలు తీసుకోవడమే కాకుండా అవసరమైతే జప్తు చేస్తాం. బడులు ప్రారంభమయ్యాక రవాణా శాఖ ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు ఉంటాయి.

– రమేష్, ఆర్‌టీఓ, కర్నూలు

గురుకుల ఫలితాలు విడుదల

- ఈ నెల 12న ప్రవేశాలకు కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో గత నెల 20న నిర్వహించిన ప్రవేశాల పరీక్ష ఫలితాలు గురువారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా విడుదల చేశారు. 5వ తరగతి, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు, గురుకుల జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం, డిగ్రీ మొదటి సంవత్సరం సీట్లకు 2023–24 విద్యా సంవత్సరానికి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలో పొందిన ర్యాంకు, రిజర్వేషన్, విద్యార్థులు ఎంపిక చేసుకున్న స్కూల్ ప్రాతిపాదికన ఎంపిక చేయనున్నారు. ఎంపిక జాబితాలను https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో ఉంచారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 12 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

జూనియర్ కాలేజీ ప్రవేశాలకు 12 నుంచి కౌన్సెలింగ్

ఏపీ గురుకుల జూనియర్ కాలేజీ ప్రవేశాల పరీక్షల్లో అర్హులైన విద్యార్థులకు ఈ నెల 12, 13, 14 తేదిల్లో కర్నూలు నగరంలోని సంతోష్‌నగర్ ఏపీ రెసిడెన్షియల్(మైనార్టీ బాయ్స్)స్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 12వ తేదిన ఎంపీసీ/ఈఈటీ, 13న బైపీసీ/సీజీడీఎం, 14వ తేదిన ఎంఈసీ/సీఈసీ గ్రూప్‌లకు కౌన్సెలింగ్ జరుగనుంది.

క్లుప్తంగా

13న పత్తికొండలో భారీ ఉద్యోగ మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన పత్తికొండలో భారీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. ఉద్యోగ మేళా పోస్టర్‌ను గురువారం ఆమె ఆవిష్కరించారు ఆవిష్కరించారు. మేళాకు గ్రీన్ టెక్, హెటిరో, అరబిందో ఫార్మా, హీల్ హై ఫ్యామిలీ, డీ మార్టు, మణప్పురం ఫైనాన్స్, బ్లూ ఓషన్, శ్రీరామ్ చిట్స్ అండ్ ఫైనాన్స్, జేబీఎం, వైఎస్‌కే ఇన్ఫోటెక్, ఎస్‌ఎల్‌వీ, నవ భారత్ ఫర్టిలైజర్ తదితర కంపెనీలు హాజరు కానున్నట్లు చెప్పారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, ఎంబీఏ, బీటెక్ చదివిన అభ్యర్థులు, 18 నుంచి 35 సంవత్సరాల వయసు ఉన్న వారందరూ పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగే ఉద్యోగ మేళాకు నేరుగా హాజరు కావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి, సిడాప్ జిల్లా మేనేజర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో 118 మంది బదిలీ

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో వివిధ కేడర్లలో పనిచేస్తున్న 118 మంది ఉద్యోగులను బదిలీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజు నాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా ఈ ప్రక్రియ చేపట్టామన్నారు. కర్నూలు జిల్లాలో ఈఓఆర్‌డీ 1, పంచాయతీ కార్యదర్శులు 39, జూనియర్ అసిస్టెంట్లు 6, బిల్ కలెక్టర్లు 6, ఆఫీస్ సబార్డినేట్లు 3, శానిటరీ మేస్త్రీలు ముగ్గురిని బదిలీ చేశామన్నారు. నంద్యాల జిల్లాలో ఈఓఆర్‌డీలు 6, పంచాయతీ కార్యదర్శులు 38, జూనియర్ అసిస్టెంట్లు 5, స్వీపర్ ఒకరిని బదిలీ చేసినట్లు వెల్లడించారు. అలాగే కర్నూలు జిల్లా నుంచి నంద్యాల జిల్లాకు ఐదుగురు పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయగా, నంద్యాల జిల్లా నుంచి ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు కర్నూలు జిల్లాకు వచ్చారన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య



ఫిదా హుసేన్ (ఫైల్)

కర్నూలు: నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఫిదా హుసేన్ (62) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామ పరిధిలో కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారి వెంబడి సర్వీస్ రోడ్డులో గురువారం మధ్యాహ్నం చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. కర్నూలు రూరల్ తాలూకా సీఐ శ్రీనివాసరెడ్డి, ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప సంఘటన స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఫిదా హుసేన్ 1995 నుంచి 2000 వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున బనగానపల్లె మండల ఉపాధ్యక్షుడుగా పనిచేశారు. ఈయనకు భార్య అత్తార్ నజీమాతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు. అందరికీ కూడా వివాహాలు చేశాడు. కొన్నేళ్లుగా ఈయన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. 15 రోజులుగా కర్నూలు కొత్తబస్టాండ్ దగ్గర ఉన్న ఓ లాడ్జిలో ఉంటూ గురువారం ఉదయం కర్నూలు నుంచి డోన్ వైపు వెళ్తూ మార్గమధ్యలో చెట్లమల్లాపురం వద్ద కారు పార్క్ చేసి సుమారు అరగంటకు పైగా ఫోన్‌లో మాట్లాడి తర్వాత తన వెంట తెచ్చుకున్న డ్రిప్ పైప్‌తో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. పొలాల్లో పనిచేస్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు అప్పుల బాధ తాళలేక బలవన్మరణానికి పాల్పడి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముగిసిన 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు సిటీ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 2వ తేదీన మొదలై గురువారంతో ముగిశాయి. ఉమ్మడి జిల్లాలో 61 కేంద్రాలు ఏర్పాటు చేయగా 11 వేల మంది విద్యార్థులకు గాను ప్రతి రోజు 20 శాతం మంది పరీక్షలకు గైర్హాజరైనట్లు డీఈఓ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13, 14 తేదీల్లో మూల్యాంకనం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోవెలకుంట్ల: బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుళ్లదూర్తికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, వెంకట్రామిరెడ్డి, దాసు ఓ వాహనంలో బుధవారం అర్ధరాత్రి కోవెలకుంట్ల నుంచి 66 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు తరలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ వెంకటరెడ్డి తమ సిబ్బందితో దాడి చేసి వాహనాన్ని పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. తహసీల్దార్ పుష్పకుమారి ఆధ్వర్యంలో రేషన్ బియ్యానికి సంబంధించి పంచనామా నిర్వహించి స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గురువారం వివరించారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలపడంతో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు గురువారం సీఎం, కర్నూలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పాతబస్తీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని మేనిఫెస్టోలో చేర్చి, ఇచ్చిన మాటకు కట్టుబడి తమను రెగ్యులర్ చేసేందుకు ప్రకటించడం అభినందనీయమని ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారాయని, ఎంతో మంది హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినా తమను రెగ్యులర్ చేయకుండా మోసం చేశారని, తమ కష్టాలు తెలిసిన నేత కేవలం సీఎం జగన్ మాత్రమే అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో మహానేత వైఎస్ఆర్ తరహాలోనే నేడు సీఎం జగన్ ఉద్యోగులకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి. కరుణానిధి, ప్రధాన కార్యదర్శి యోసేపు, నాయకులు చిన్న రాముడు, బాలయ్య, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలతో మేధో వికాసం

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, రామకృష్ణారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): చెస్ పోటీలు మేధో వికాసానికి దోహదం చేస్తాయని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో ఆంధ్ర చెస్ సంఘం ఆధ్వర్యంలో అండర్ –19 ఫీడే ర్యాంకింగ్ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ ప్రారంభమైంది. పోటీలను ఎంపీ పోచా, నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, రామకృష్ణా విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఆంధ్ర చెస్ సంఘం అధ్యక్షులు కెవీవీ శర్మ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చదరంగం క్రీడ వలన బాలల్లో మానసిక వికాసం కలుగుతుండటంతో ఈ క్రీడను పాఠ్యాంశంగా చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో క్రీడా పోటీలకు ఇండోర్ స్టేడియం కూడా ఎంతో ఉపయోగపడుతుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడల్లో ఖ్యాతి పొందిన నంద్యాల జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు తన సాయశక్తులా కృషి చేస్తానన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నంద్యాల చెస్ పోటీలు తరచూ నిర్వహించడం అభినందనీయమన్నారు. నంద్యాల చెస్ సంఘం ఏర్పడిన తర్వాత మొట్ట మొదటి ర్యాంకింగ్ రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్ తన కళాశాలలో నిర్వహించడం సంతోషమన్నారు. ఆంధ్ర చెస్ అధ్యక్షులు కెవీవీ శర్మ, జిల్లా అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆదివారం సాయంత్రం ముగింపు కార్యక్రమంలో విజేతలకు పతకాలు, ట్రోఫీలు బహూకరిస్తామన్నారు. అనంతరం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రామకృష్ణారెడ్డిలు చదరంగం పోటీలను ప్రారంభించారు. పోటీలకు ముఖ్య అతిధులుగా హాజరైన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా క్రీడా అధికారి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు చంద్రమోహన్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫెయిలైన వారు పరీక్ష రాసేందుకు అనుమతి

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో 2016–17 విద్యా సంవత్సరంలో ఏదైనా ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయి పరీక్ష ఫీజు చెల్లించిన వారికి పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఇందిరాశాంతి గు రువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వతేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేవీఆర్ కాలేజీలోనే పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

హెచ్‌ఎంల బదిలీలు పూర్తి

- స్కూల్ అసిస్టెంట్‌లకు నేడు ఉత్తర్వులు
- ముగిసిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలో 119 మంది ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. బదిలీ ఉత్తర్వులు అందుకున్న ప్రధానోపాధ్యాయులతో పాటు పదోన్నతులు పొందిన హెచ్‌ఎంలు సైతం గురువారం సాయంత్రంలోగా ఆయా స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఇదిలాఉంటే ఉపాధ్యాయుల బదిలీలకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ గురువారం నాటికి ముగిసింది. జిల్లాలో నాన్ లాంగ్వేజ్ టీచర్లలో కంపల్సరీ బదిలీకి 1,166 మంది దరఖాస్తు చేసుకోగా 1,066 మంది.. రిక్వెస్ట్ బదిలీకి 1,577 మంది దరఖాస్తు 1,460 మంది.. లాంగ్వేజెస్‌లలో కంపల్సరీ బదిలీకి 484 మంది దరఖాస్తు చేసుకోగా 428 మంది.. రిక్వెస్ట్ బదిలీకి 1,044 మంది దరఖాస్తు చేసుకోగా 975 ఆప్షన్స్ ఇచ్చుకున్నారు. వీరందరికీ శుక్రవారం ఉదయానికి ఉత్తర్వులు వెలువడనున్నాయి. శుక్రవారం సాయంత్రంలోపు ఆర్డర్లు పొందిన వారంతా ఆయా స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. ఇక ఎస్‌జీటీ టీచర్లకు అర్ధరాత్రి వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చే ప్రక్రియ కొనసాగింది. వీరందరికీ నేటి సాయంత్రం లేదా శనివారం ఉదయానికి బదిలీ ఉత్తర్వులు అందనున్నాయి.

ఫోర్జరీ కేసు నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: రెవెన్యూ రికార్డుల్లోని లేని వ్యవసాయ భూమికి నకిలీ పత్రాలతో పాస్ పుస్తకాలు సృష్టించి, ఆ పత్రాలతో బ్యాంక్ లోన్ తీసుకోవడంతో పాటు అమాయకులైన ఇతరులకు తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన ముఠా ఆట కట్టించారు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి. జిల్లాలో నకిలీ పాసు పుస్తకాలను సృష్టించి సొమ్ము చేసుకునే ముఠా సభ్యులను అరెస్ట్ చేశారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను మీడియాకు వివరించారు. చాగలమర్రి మండలం శెట్టివీడు గ్రామ పరిధిలో లేని భూమికి కొత్త సర్వే నెంబర్ సృష్టించి ఏడుగురి పేరు మీద సుమారు 29 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో చేయించిన శెట్టివీడు గ్రామ వీఆర్‌ఓ కలాముల్లా హుస్సేన్‌సాహెబ్, కంప్యూటర్ ఆపరేటర్ తలారి తిప్పనపల్లె మధు, వీఆర్‌ఓ హరినాథ్‌రావు, కంప్యూటర్ ఆపరేటర్ రాము, తలారి శ్రీనివాసరావు, ప్రధాన సూత్రధారి ముత్యాలపాడుకు చెందిన దావీదు, తలారి ప్రతాప్‌లను అరెస్టు చేశామన్నారు. డాలు అరుణ్ కుమార్ అనే వ్యక్తి చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై శెట్టివీడు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 3–1ఏ రికార్డులలో లేనప్పటికీ కొత్త పత్రాలను సృష్టించారన్నారు. ఈ సర్వే నెంబర్లను ఏడుగురికి ఆన్‌లైన్‌లో పొందుపరచి వివిధ బ్యాంకులలో రుణాలు తీసుకుని ప్రభుత్వ పథకాలను పొందుతూ ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశారన్నారు. ఇందులో డాలు నరసింహులు 4.12 సెంట్ల భూమిని ఆలమూరు గ్రామస్తుడైన దేవదాసుకు విక్రయించారన్నారు. అదే విధంగా పుష్పరాజ్ సుమారు 4.18 సెంట్ల భూమిని పది లక్షలకు బాకీ కింద రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. అలాగే పాస్ పుస్తకాల మంజూరు చేసిన మాజీ తహసీల్దార్ మాలకొండయ్యను గురువారం అరెస్టు చేశామన్నారు. నకిలీ పత్రాల కేసును ఛేదించిన ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య, ఆళ్లగడ్డ సీఐ రాజశేఖర్‌రెడ్డి, చాగలమర్రి ఇన్‌చార్జ్ ఎస్‌ఐ నరసింహులును ఎస్పీ అభినందించారు.

నెలాఖరులోగా గోరుకల్లు పనులు పూర్తి

- సీఈ కబీర్‌బాషా



గోరుకల్లు కట్టను పరిశీలిస్తున్న సీఈ కబీర్‌బాషా

పాణ్యం: కుంగిన గోరుకల్లు జలాశయ కట్ట పనులు నెలాఖరులోగా పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు సీఈ కబీర్‌బాషా తెలిపారు. గురువారం గోరుకల్లు కట్ట వద్ద జరుగుతున్న పునరుద్ధరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గోరుకల్లు కట్టపై రెండు చోట్ల ఫాల్ట్ జోన్‌లుగా గుర్తించామన్నారు. వాటి మరమ్మతులు వేగవంతం చేసేందుకు అవసరమైన నిర్మాణ సామగ్రిని సిద్ధంగా ఉంచామన్నారు. ప్రస్తుతం జలాశయంలో 3.01 టీఎంసీలు నీరు నిల్వ ఉందని, నీటి మట్టాన్ని ఇంకా తగ్గించి ఇంకా ఎక్కడైనా ఫాల్ట్ జోన్ పనులు ఉంటే గుర్తించి మరమ్మతులు చేపడుతామన్నారు. ఇందుకనుగుణంగా ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు 350 క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా సిబ్బందికి సూచనలు చేశామన్నారు. రిజర్వాయర్ పరిధిలో అసంపూర్తి పనులపై ఆరా తీశారు. ఆయన వెంట ఈఈ సుభకుమార్, డీఈఈలు, ఏఈలు, జేఈలు తదితరులు ఉన్నారు.